**రంజాన్ వేళలు**
ఇఫ్తార్: 6:33 (గురువారం సాయంత్రం)
సహార్: 4:58 (శుక్రవారం ఉదయం)




# ఫ్యూచర్ సిటీపైనే ఫోకస్!

బడ్జెట్ 2025-26

## ఉమ్మడి జిల్లాకు కేటాయింపులు అంతంతే!

డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటుచేయనున్న ఫ్యూచర్ సిటీపైనే ప్రభుత్వం ఎక్కువగా ఫోకస్ పెట్టింది. బడ్జెట్ ప్రసంగంలో భట్టి అధికంగా ఫ్యూచర్‌సిటీ గురించే ప్రస్తావించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అరకొర నిధులు కేటాయింపు జరిగింది. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాకు ఈ బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చింది. తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని గతంలో అనేక సార్లు ప్రకటించినా ప్రత్యేక నిధులేమీ కేటాయించలేదు. మేడ్చల్ జిల్లాలో 10వేల ఎకరాల్లో రూ.450కోట్లతో ఉద్యాన పంటల హబ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఒక్కపైసా ఇవ్వలేదు.



- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు అరకొర నిధులు
- లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులపై మాత్రమే హామీ
- మెట్రో విస్తరణకు అత్తెసరు నిధులు
- రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో పశు టీకాల రీసెర్చ్ సెంటర్
- కొహెడలో ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు ఓకే
- శంకర్‌పల్లిలో 250 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లావాసులను కొంత నిరాశకు గురిచేసింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఈ బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు ఉంటాయని అందరూ భావించారు. కానీ, ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.1736కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ ప్రాజెక్టులో భాగమైన రిజర్వాయర్‌ను మాత్రమే ప్రస్తావించింది. జైపాల్‌రెడ్డి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. కేటాయించిన బడ్జెట్‌లో రిజర్వాయర్ నిర్మాణానికి ఎంత ఖర్చు చేస్తారు?.. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతంలో కొనసాగుతున్న పనులకు కేటాయింపులు ఎంత?.. కొత్తగా ఉమ్మడి జిల్లాలో ఏమైనా పనులు

మిగతా 7వ పేజీలో...

### మరిన్ని నిధులివ్వాల్సింది



ఇబ్రహీంపట్నం : బడ్జెట్ ఆశాజనకం. వ్యవసాయ, విద్యా రంగాలకు పెద్దపీట వేశారు. సంక్షేమానికి మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేది. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో చూపిన కేటాయింపుల మేరకు నిధులు ఖర్చు చేయాలి. గత ప్రభుత్వంలో అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలి.

- పాలమాకుల జంగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

### రూ. 10లక్షలు దాటేసింది!

**తలసరి ఆదాయంలో 'రంగారెడ్డి' సరికొత్త రికార్డు**
**అగ్రస్థానంలో రంగారెడ్డి, చిట్టచివరి స్థానంలో వికారాబాద్**

దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం గల జిల్లాగా కొనసాగుతున్న రంగారెడ్డి జిల్లా మరో సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం రంగారెడ్డి జిల్లా రూ.10,55,913 తలసరి ఆదాయంతో అగ్రస్థానంలో నిలిచింది. దేశంలో తొలిసారిగా తలసరి ఆదాయంలో రూ.10లక్షల మార్క్ దాటిన జిల్లాగా రికార్డుల్లోకి ఎక్కింది. దేశంలో రెండు, మూడు స్థానాల్లో ఉన్న హర్యానా రాష్ట్రంలో గుర్‌గావ్ జిల్లా, కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరు అర్బన్ జిల్లాలో తలసరి ఆదాయంలో రూ.9లక్షలకు చేరువలో ఉన్నాయి. ఇదిలాఉంటే ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం రంగారెడ్డిజిల్లా అగ్రస్థానంలో ఉండగా, పక్కనే ఉన్న వికారాబాద్ జిల్లా రూ.1,98,401 తలసరి ఆదాయంతో చిట్టచివరి స్థానంలో ఉండడం గమనార్హం. రంగారెడ్డి జిల్లా తరువాత రెండో స్థానంలో హైదరాబాద్(రూ.5,54,105), మూడో స్థానంలో సంగారెడ్డి(రూ.3,45,478) ఉండగా మేడ్చల్ మల్కాజ్‌గిరి(రూ.3,43,130) నాలుగో స్థానంలో నిలిచింది.



## 'పది' పరీక్షలకు సిద్ధం



### రేపటి నుంచి ప్రారంభం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 249 సెంటర్లు.. 51,794 మంది విద్యార్థులు
- ఫ్లయింగ్ స్క్వాడ్స్ 10.. సిట్టింగ్ స్క్వాడ్స్ 249

**విద్యార్థుల వివరాలు**

| యాజమాన్యం | స్కూల్స్ | విద్యార్థులు |
|---|---|---|
| ఎయిడెడ్ | 04 | 156 |
| ఏఎస్ఆర్ఏఎమ్ | 01 | 47 |
| బీసీడబ్ల్యుఆర్ఎస్ | 16 | 1,029 |
| ప్రభుత్వ | 04 | 320 |
| కేజీబీవీ | 20 | 932 |
| ప్రైవేట్ | 721 | 34,910 |
| టీఎంఆర్ఈఐఎస్ | 09 | 492 |
| టీఎస్ఎంఎస్ | 09 | 783 |
| టీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ | 15 | 1,133 |
| టీటీడబ్ల్యుఆర్ఎస్ | 03 | 174 |
| జెడ్పీ | 238 | 11,818 |
| మొత్తం | 1,040 | 51,794 |

రంగారెడ్డి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 249 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో సైబరాబాద్ పరిధిలోని 122, హైదరాబాద్‌లో రెండు, రాచకొండ పరిధిలో 125 పరీక్ష కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో ప్రైవేట్‌గా 145, ఎయిడెడ్ 3, కేజీబీవీలు ఒకటి, గవర్నమెంట్ 4, జెడ్పీ స్కూళ్లు 85, టీజీఎంఎస్ 7, టీజీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ సెంటర్లు మూడు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 249 కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, బీసీడబ్ల్యుఆర్ఎస్, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల నుంచి మొత్తం 51,794 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒక్క సైన్స్ పరీక్షలు తప్ప మిగిలినవి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతాయి. సైన్స్ సబ్జెక్టును భౌతిక, రసాయన శాస్త్రాలుగా మార్చి వాటిని వేర్వేరు రోజుల్లో నిర్వహించాలని నిర్ణయించడంతో.. ఆ రెండు పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతాయి. ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీతో ముగుస్తాయి. 3, 4 తేదీల్లో ఓరియంటల్ సబ్జెక్టుల పరీక్షలు జరుగుతాయి. గత ఏడాది వరకు



మిగతా 8వ పేజీలో...

### జిల్లాలో నేడు

**కేశంపేటలో ర్యాలీ**

కేశంపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు అసెంబ్లీలో ఆమోదించినందుకు కృతజ్ఞతగా నేడు(గురువారం) కేశంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్నామని పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనుమగళ్ల రమేష్ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. కేశంపేట మండల కేంద్రంలో ఉదయం 10గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ర్యాలీకి కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## పంట రుణాల లక్ష్యాన్ని అధిగమించాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చిన్న వ్యాపారులు, మధ్యతరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వాటిని ప్రోత్సహించేందుకుగాను అధిక రుణాలను అందించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. వానాకాలం, యాసంగికి సంబంధించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, రాబోయే సీజన్లలో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని అధిగమించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. రుణ పంపిణీలో కొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ, తదితర శాఖలతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలన్నారు. రుణాలు తీసుకున్న వారు యూనిట్లు స్థాపించారా లేదా అని నిశితంగా పరిశీలించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తిస్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలన్నారు. సబ్సిడీ రుణాలను వేగవంతంగా అందజేయాలన్నారు. విద్య, గృహ నిర్మాణాల రుణాలు తక్కువగా ఇచ్చిన బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. మెప్మా ద్వారా స్వయం ఉపాధి కల్పించే పథకాలను, బ్యాంకు లింకేజీ రుణాలను కూడా త్వరితగతిన గ్రౌండ్ అయ్యేవిధంగా చూడాలని ఆదేశించారు. అంతకుముందు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ శ్రీదేవి మాట్లాడుతూ.. ఆర్‌బీఐ గైడ్‌లైన్స్ ఆధారంగా అన్నీ బ్యాంకులు తమ పరిధిలో పంట రుణాలను అధికంగా ఇవ్వాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ కుసుమ, నాబార్డు ఏజీఎం, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహ్మారావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీలత, మెప్మా పీడీ మల్లీశ్వరి, వివిధ బ్యాంకర్లు పాల్గొన్నారు.

## కంకర రోడ్డుతో కష్టాలు!

### అర్ధంతరంగా నిలిచిన బీటీ నిర్మాణం

రాళ్లు తేలిన దారిపై వాహనదారుల కుస్తీ.. పట్టించుకోని పాలకులు, అధికారులు


నందిగామ నుంచి బైపాస్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి

నందిగామ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కంకర రోడ్డుపై వాహనదారులు కష్టాలు పడుతున్నారు. రాళ్ల దారిపై వాహనాలు నడపాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఎక్కడ అదుపుతప్పి కిందపడిపోతామోనని భయపడుతున్నారు. మూడేళ్ల క్రితం నందిగామ మండలకేంద్రం నుంచి బైపాస్ రోడ్డు వరకు బీటీ నిర్మాణం కోసం పరిచిన కంకర మేకుల్లా తేలి వాహనాలు నడపలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 సంవత్సరంలో 260 మీటర్ల మేర బీటీ రోడ్డు పనులకు రూ.35 లక్షలు మంజూరు చేసింది. నందిగామ నుంచి కొద్దిదూరం వరకు సీసీ రోడ్డు వేసి ఆ తర్వాత బీటీ వేయాల్సిన చోట కంకర వేసి పనులు అర్ధంతరంగా ఆపేశారు. మేకగూడ, రంగాపూర్, చాకలిగుట్టతాండ, సంగిగూడ, పిట్టలగూడ ప్రజలు నందిగామ మండల కేంద్రానికి రావడానికి ఈ కంకర రోడ్డుపై నుంచే రావాల్సి ఉంటుంది. అయితే ఈ కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో టెండర్ రద్దయ్యిందని, అందుకే పనులు ఆగిపోయాయని కింది స్థాయి అధికారులు చెబుతున్నారు. త్వరలోనే కొత్త టెండర్ వేసి పనులు పూర్తిచేస్తామని వివరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు కల్పించుకొని బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి



నందిగామ మండలకేంద్రం నుంచి బైపాస్‌కు వెళ్లే రోడ్డును త్వరగా పూర్తిచేయాలి. సగం సగం పనులు చేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై కంకర వేసి వదిలేయడంతో వాహనాలు ఇబ్బందులు పడుతున్నాం. పాలకులు, అధికారులు కల్పించుకుని బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయించాలి.

మురళి, పిట్టలగూడ

### త్వరలో పనులు పూర్తి చేస్తాం

నందిగామ మండలకేంద్రం నుంచి బైపాస్ రోడ్డు వైపు వెళ్లే రోడ్డు పనులను సంబంధిత కాంట్రాక్టర్ అర్ధంతరంగా ఆపేయడంతో అతని టెండర్ రద్దయ్యింది. త్వరలోనే కొత్త టెండర్ వేసి మరో కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకుంటాం.

- హేమంత్, పంచాయతీరాజ్ ఏఈ

### పకడ్బందీగా ఆహార భద్రత చట్టం

ఆమనగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆహార భద్రత చట్టం 2013 అమలుపై కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీమాసింగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. చట్టం అమలుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులకు రాష్ట్ర ఆహా భద్రత కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో తనిఖీల్లో భాగంగా గుర్తించిన అంశాలను కలెక్టర్, అధికారులకు వివరించి చర్యలు చేపట్టాలని కోరారు.

### వేతనాలు చెల్లించాలి

షాబాద్, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా ప్రధానకార్యదర్శి బుద్దుల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన్‌మర్రిలో కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తేసే యోచన చేస్తుందని ఆరోపించారు. సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, భిక్షపతి, వెంకటేష్, నర్సింహులు, లక్ష్మమ్మ, నర్సింహులు, మణెమ్మ తదితరులు ఉన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు


## ఆశాల సమస్యలు పరిష్కరించాలి

» కలెక్టరేట్ ఎదుట ఆందోళన

రంగారెడ్డి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి జి.కవిత డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తిచేసిన ఆశాలకు ఏఎన్ఎం పోస్టులో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. వెయిటేజీ మార్కులు వెంటనే నిర్ణయించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం బీమా రూ.50 లక్షలు చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.



## దేవుని పడకల్‌లో ఘనంగా రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

తలకొండపల్లి, మార్చి19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద రథోత్సవ కార్యక్రమాన్ని బుధవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ అనువంశిక ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్ రెడ్డి, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో భక్తులకు విశాల వసతులు ఏర్పాటుచేశారు. రథాన్ని పచ్చటి శోభాయమానంగా అలంకరించి రథంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి తాళ్లతో రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, రామానుజాచార్యులు, గోపాలచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, లంకా దహనం, అశ్వ వాహనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, శంకర్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## పౌష్టికాహారం అందించాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి


భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత విషయంలో అలసత్వానికి తావుండకూడదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం విధిగా అందించాలని సూచించారు. మండల కేంద్రంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, గోవర్ధన్‌రెడ్డి, బూక్య జ్యోతితో కలిసి 3వ నెంబర్ రేషన్ దుకాణం, శివాలయం సమీపంలోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కేజీబీవీ, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. రేషన్ దుకాణం రికార్డులను పరిశీలించారు. అంతోద్యయ కార్డుల వినియోగదారులకు ప్రతినెల చక్కెర ఇవ్వకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శివాలయం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి తక్కువ సైజు ఉన్న గుడ్లను చూసి చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఆహారం అందుతున్న తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి కేజీబీవీకి చేరుకుని రికార్డులు, పరిసరాలు పరిశీలించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆర్డీవోజగదీశ్వర్‌రెడ్డి, డీడబ్ల్యూవో సంధ్య, ఏపీడీలు నరేందర్‌రెడ్డి, చరణ్, నవీన్‌రెడ్డి, సీడీపీవో శాంతిరేఖ, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, డీటీలు రవిందర్‌నాయక్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

## హన్మాపూర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

-కన్నతల్లి, కట్టుకున్న భార్యపైనే అనుమానం.. కేసు నమోదు


వెంకటేశ్(ఫైల్)

పెద్దేముల్, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి రక్తపు మడుగులో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. కాగా, అతని మృతిపై కన్నతల్లి, కట్టుకున్న భార్యనే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్దేముల్ మండలం హన్మాపూర్ గ్రామానికి చెందిన బక్కని వెంకటేశ్(33)కు అదే గ్రామానికి చెందిన సబితతో 14ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. పెళ్లి జరిగిన నాలుగైదు సంవత్సరాల నుంచి వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగొచ్చి కుటుంబ సభ్యులను వేధిస్తుండేవాడు. పెద్దమనుషుల మధ్యన కూర్చోబెట్టి అతడి ప్రవర్తన మార్చుకోవాలని చెప్పించారు. అయినా అతనిలో మార్పురాలేదు. ఒకసారి భర్త వేధింపులు భరించలేక భార్య సబిత చితకబాదింది. ఆ తర్వాత అత్తాకోడలు ఇద్దరూ ఇల్లు విడిచి బతుకుదెరువుకు హైదరాబాద్ వెళ్లారు. కొన్ని నెలలు అక్కడే ఉన్న వారు రెండునెలల క్రితం తిరిగి ఊరికి వచ్చారు. వారు వచ్చినప్పటి నుంచి మళ్లీ వెంకటేశ్ ఎప్పటిలాగే తాగివచ్చి వారిని ఇబ్బంది పెడుతున్నాడు. ఏమైందో తెలియదు మంగళవారం రాత్రి తన ఇంటి ఆవరణలోనే హత్యకు గురయ్యాడు. బుధవారం తెల్లవారుజామున అతడి తల్లి లక్ష్మమ్మ, కోడలు సబితతో కలిసి పొరుగున ఉంటున్న తనచిన్న కుమారుడు బక్కని శ్రీనివాస్‌వద్దకు వెళ్లి, వెంకటేశ్‌ను ఎవరో కొట్టిచంపారని చెప్పింది. దీంతో ఇంటికి వచ్చి చూసే సమయంలో రక్తపు మడుగులో ఉన్న తన అన్న మృతదేహాన్ని చూసి తల్లి, వదినలపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేశ్, ఎస్ఐ.శ్రీధర్‌రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. అనుమానితులుగా ఉన్న తల్లి లక్ష్మమ్మ, భార్య సబితలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

## భారీగా కారుణ్య నియామకాలు

వికారాబాద్, మార్చి19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో భారీసంఖ్యలో కారుణ్య నియామకాలులు చేపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, పీఆర్ ప్రిన్సిపల్‌సెక్రటరీ లోకేష్‌కుమార్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజనలకు టీపీఆర్ఎంటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, ఆకుల నందకుమార్ ధన్యవాదాలు తెలిపారు. విధి నిర్వహణలో మృతి చెందిన పీఆర్ఆర్‌డీ ఉద్యోగులు, జడ్పీ, మండల పరిషత్తు ఉపాధ్యాయుల వారసులను జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లోనియమించేందుకు తెలంగాణ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పోస్టుల అప్‌గ్రేడేషన్, సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి ఒకేసారి 582 మందికి నియామక పత్రాలు అందజేయడం అభినందనీయమన్నారు.

## పేద ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు

» లీగల్ సర్వీస్ అథారిటీ జిల్లా కార్యదర్శి, జడ్జి డీబీ శీతల్

పరిగి, మార్చి19(ఆంధ్రజ్యోతి): జైలులో మగ్గుతున్న పేద ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని లీగల్ సర్వీస్ అథారిటీ జిల్లా కార్యదర్శి, జడ్జి డీబీ శీతల్ అన్నారు. బుధవారం ఆమె పరిగి సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అలాగే జైలులో వసతులు, భోజనం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పేద ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలందించేందుకు ప్రత్యేకంగా న్యాయవాదులు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, గౌస్‌పాషా, వెంకటేశ్, శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె పరిగి బాలసదనాన్ని సందర్శించారు.



(ఐదో పేజీ తరువాయి)

చేపడతారా? అనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఈ ఏడాది ఈ రిజర్వాయర్ పనుల వరకే ప్రభుత్వం పరిమితమైనట్లు కనిపిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో 2.7లక్షల ఎకరాలకు సాగు నీరందించే ప్రాజెక్టు పనులు ఈ ఏడాది కూడా పెద్దగా ముందుకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. అలాగే నగర శివార్లలో చేపట్టనున్న మెట్రో విస్తరణ పనులకు అత్తెసర కేటాయింపులే చేశారు. దీన్నిబట్టి ఈ ఏడాది మెట్రో విస్తరణ పనులు ఎంత వరకు ముందుకు వెళ్తాయో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే నగర శివార్లలో కొత్తగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీపై ప్రభుత్వం ఎక్కువ ఫోకస్ పెట్టింది. రాష్ట్రానికే కాదు దేశానికే తలమానికంగా ఉండే మొట్టమొదటి నెట్ జీరో ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి భట్టి తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాలతో పోటీపడేలా కాలుష్యరహితంగా, అత్యంత ఆధునిక సదుపాయాలతో దీన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. శ్రీశైలం- నాగార్జునసాగర్ హైవేల మధ్యన ఉన్న 56 గ్రామాల్లోని 765 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా అర్బన్ ప్రాజెక్టును పర్యవేక్షించడానికి ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సిటీలో మల్టీమోడల్ కనెక్టివిటీ, ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు, గ్రీన్ బిల్డింగ్‌ల వంటి ఆధునిక సౌకర్యాలు ఉంటాయి. ఏఐసిటీ, ఫార్మాహబ్, స్పోర్ట్స్‌సిటీ, క్లీన్ ఎనర్జీ ఇన్నోవేషన్ తదితర జోన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన పురపాలక సంఘాలు, పట్టణాభివృద్ధి సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి రూ.4500కోట్లు కేటాయించారు. ఇందులో సింహభాగం నిధులు ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలోని పురపాలికలకు అందుతాయి. వచ్చే మూడేళ్లలో ఈ నిధులు ఖర్చుచేయనున్నారు. గ్రీన్ స్థిరత్వాన్ని మెరుగుపరిచేందుకు శంకరపల్లి వద్ద 250 మెగావాట్లు బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల ఫేజ్-2 కింద చేపడుతున్న నీటి సరఫరా ప్రాజెక్టు చివరిదశకు చేరుకుంది. దీని ద్వారా హెచ్ఎండీఏ పరిధిలోని ప్రాంతాలకు తాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు. మూసీనది అభివృద్ధి ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో గత ఏడాది మాదిరిగానే ప్రభుత్వం

# ఫ్యూచర్ సిటీపైనే ఫోకస్!



రూ.1500కోట్లు కేటాయించింది. ఔటర్ రింగురోడ్డుకు ఆనుకొని హైదరాబాద్ నగరం నలువైపులా శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసి, అల్పాదాయ, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా గృహ సముదాయాలను నిర్మించే ప్రణాళికలను అమలు చేస్తామని తెలిపింది.

### మెట్రో విస్తరణకు నిధులేవీ?

2024-25 వార్షిక బడ్జెట్‌లో మెట్రో రైలు విస్తరణకు అంతంత మాత్రంగానే నిధులు కేటాయించారు. నగర శివార్లలోని ఫ్యూచర్ సిటీతో పాటు శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మేడ్చల్, శామీర్‌పేట, హయత్‌నగర్ వరకు మెట్రో రైల్ విస్తరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన రూట్‌మ్యాప్ కూడా విడుదల చేసింది. అయిదు కారిడార్లకు రూ.24,269 కోట్ల అంచనా వేయగా తాజా బడ్జెట్‌లో రూ.1100 కోట్లు కేటాయించింది. ఇందులో ఓల్డ్‌సిటీ కారిడార్‌కు రూ.500 కేటాయించగా నాగోల్-ఎయిర్‌పోర్టు కారిడార్‌కు రూ.100 కోట్లు మాత్రమే కేటాయించింది. బడ్జెట్‌లో అత్తెసరు నిధులు కేటాయించడం చూస్తే ఈ ప్రాజెక్టు పనులు ఈ ఏడాది మొదలయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

### ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా...

రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ప్రముఖ సందర్శనీయ స్థలాలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కనెక్టివిటీ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేక టూరిజం ప్రాంతాల (ఎస్‌టీపీ) అభివృద్ధి కింద రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన ప్రముఖ సందర్శనీయ స్థలాల్లో హెలిప్యాడ్‌ల నిర్మాణం చేపడతారు. విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా సందర్శనీయ ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

### మామిడిపల్లిలో పశుటీకాల రీసెర్చ్ కేంద్రం

మామిడిపల్లిలో పశుటీకాల పరిశోధన సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పశు టీకాల కోసం వెటర్నరీ బయోలాజికల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను మామిడిపల్లికి తరలించనున్నట్లు తెలిపింది. అన్ని ఆధునిక సౌకర్యాలతో రూ.300 కోట్లతో దీన్ని విస్తరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే చేపల ఎగుమతిని ప్రోత్సహించడానికి రంగారెడ్డి జిల్లా కొహెడలో రూ.47 కోట్లతో హోల్‌సేల్ చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో తెలిపారు. రాష్ట్రంలో మేలు జాతి పాడి పశువులను వృద్ధి చేయడానికి రంగారెడ్డి జిల్లా కంసాన్‌పల్లిలో ఫ్రోజెన్ సెమన్ బుల్‌స్టేషన్‌ను రూ.21 కోట్లతో నిర్మించనున్నారు.

### అన్ని వర్గాలకు అనుకూలంగా...



రంగారెడ్డి అర్బన్ : అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం రూపొందించిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలతోపాటు రైతులు, ఉద్యోగులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలు, విద్యార్థులు, కార్మికుల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కొందరి లేనిపోని విమర్శలు చేస్తున్నారు.

- పట్నం మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్

### ఇది ప్రజా సంక్షేమ బడ్జెట్



షాద్‌నగర్ : ప్రజా సంక్షేమాన్ని ఆకాంక్షించి కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టింది. ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రూ.23వేల కోట్లు కేటాయించింది. ఈ నిధులతో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి మోక్షం లభించనుంది. అలాగే ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి వద్ద నిలిచిపోయిన పశువీర్య ఉత్పత్తి కేంద్ర నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించేందుకు బడ్జెట్‌లో రూ.20కోట్లు ప్రత్యేకంగా కేటాయించింది.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే షాద్‌నగర్

### విద్య, వైద్యానికి మరిన్ని నిధులిస్తే బాగుండేది



షాద్‌నగర్ : బడ్జెట్‌లో విద్య, వైద్యానికి మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేది. అలాగే పేదరిక నిర్మూలన కోసం కూడా ప్రత్యేంగా నిధులు కేటాయించాల్సిన అవసరం అలాగే ఇరిగేషన్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కనీసం రూ.30వేల కోట్లు కేటాయించాల్సిన అవసరం ఉంది.

- బక్కని నర్సింహులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

### ఇది అంకెల గారెడీ బడ్జెట్



శంషాబాద్ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారెడీగా ఉంది. దీనివల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలకు బడ్జెట్‌కు పోలికే లేదు. ఈ బడ్జెట్‌లో అన్ని రంగాలకు మొండిచేయి చూపించారు. ముఖ్యంగా విద్యకు సరైన నిధులు కేటాయించలేదు.

- రాజ్‌భూపాల్‌గౌడ్, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు

### అన్ని రంగాలకు ప్రాధాన్యం



బడ్జెట్‌లో వ్యవసాయరంగం, మహిళలు, యువజన వికాసం, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలు పెద్దపీటవేసింది. యువతకు ఉద్యోగాలు కల్పించే విధంగా నిధులు ప్రకటించారు. వ్యవసాయ శాఖకు రూ.24,439 కోట్ల భారీ నిధులు కేటాయించిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కింది. అన్ని వర్గాల సంక్షేమం కోరే విధంగా ఈ బడ్జెట్ ఉంది.

- రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే . పరిగి

### ఇది అభివృద్ధిని సూచించే బడ్జెట్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది ప్రజా బడ్జెట్. పేదరికాన్ని నిర్మూలించే దిశగా పద్దును రూపొందించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం సంతోషకరం. ఎన్నికల ప్రచారంలో చెప్పిన ఆరు గ్యారెంటీలను తక్కువ కాలంలో అమలు చేస్తున్నారు.

-బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

### విద్య, వైద్యానికి మొండిచెయ్యి



ఈ బడ్జెట్‌లో విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి కాంగ్రెస్ కార్యకర్తల కోసం రూ.6వేల కోట్లు కేటాయించడం ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతోంది. దానికి 'యువ వికాసం' పేరుతో తెలంగాణ వినాశనాన్ని ఈ ప్రభుత్వం కోరుతుంది. ఢిల్లీకి మూటలు పంపేందుకు పెట్టిన బడ్జెట్‌గా మాత్రమే కనిపిస్తోంది. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలను పట్టించుకోలేదు.

-ఆనంద్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్

### జిల్లాకు గాడిద గుడ్డే...



బడ్జెట్‌లో వికారాబాద్ జిల్లాకు ఒరిగిందేమీ లేదు. గాడిద గుడ్డే ఇచ్చారు. వికారాబాద్, తాండూరు, పరిగి ప్రాంతాలకు ఒక పరిశ్రమ కూడా ఇవ్వలేదు. రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పించే ప్రయత్నం చేయలేదు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నా తలసరి ఆదాయం అత్యంత తక్కువ ఉన్న జిల్లా వికారాబాద్ కావడం శోచనీయం. నిధుల కేటాయింపుల్లో కొడంగల్‌కు ప్రాధాన్యత ఇస్తూ.. తాండూరు, పరిగి, వికారాబాద్‌కు మొండిచెయ్యి చూపారు.

-కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్

### మేడ్చల్, వికారాబాద్ వాసులకు నిరాశ

మేడ్చల్ జిల్లాలో 10వేల ఎకరాల్లో రూ.450కోట్లతో ఉద్యాన పంటల హబ్ ఏర్పాటు చేస్తామని గతంలో హామీ ఇచ్చినప్పటికీ ఈ బడ్జెట్‌లో ఈ ప్రస్తావనే లేదు. అలాగే బడ్జెట్‌లో వికారాబాద్ జిల్లా అభివృద్ధికి దోహదపడే విధంగా ఎలాంటి ప్రత్యేక ప్రకటనలు లేకపోవడం జిల్లా వాసులను తీవ్ర నిరాశకు గురిచేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వికారాబాద్ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఈ బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి లభించింది. ప్రకృతి సౌందర్యానికి నిలయమైన అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని గతంలో అనేక సార్లు ప్రకటించినా ప్రత్యేక నిధులేమీ కేటాయించలేదు. తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి కొండలను పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వికారాబాద్‌లో గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని గత రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంత విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కూడా ఈ బడ్జెట్‌లో ప్రస్తావన లేదు.

### ప్రజలను మభ్యపెట్టేలా ఉంది



రాష్ట్ర బడ్జెట్ పేదల కష్టాలను తీర్చేలా లేదు. ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై ఊసే లేదు. ప్రజలను మభ్యపెట్టే విధంగా ఉంది. ప్రజలు ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

-మల్లారెడ్డి, ఎమ్మెల్యే, మేడ్చల్

### మేడ్చల్‌కు మొండి చేయి



బడ్జెట్‌లో మేడ్చల్ జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం మొండి చేయి చూపింది. కనీస నిధులు కేటాయించకపోవడం దారుణం. విద్యా, వైద్య రంగాలకు కేటాయింపులు పెంచాలి. జిల్లాలో రింగు రోడ్డు లోపల ఉన్న గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. వాటి అభివృద్ధికి కూడా నిధులు కేటాయించలేదు.

-విక్రంరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

### ప్రస్తుత పరిస్థితిలో మేలైన బడ్జెట్



ప్రస్తుత పరిస్థితుల్లో ఇది మేలైన బడ్జెట్. పూర్తి సంతృప్తికరంగా లేకపోయినా కొంత ఫర్వాలేదు. కేంద్రం సహకరించకపోయినా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో నెట్టుకొస్తోంది. కానీ ఈ బడ్జెట్ ఆశించిన స్థాయిలో లేదు. కేంద్రం సహకరించడం లేదు.

-విజయలక్ష్మి పండిత్, సీపీఐ జిల్లా కార్యదర్శి, వికారాబాద్

## ప్రొసీడింగ్స్ తెస్తే సరిపోతుందా?

- అభివృద్ధి చేసి చూపెట్టాలి!
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న సుదర్శన్‌గౌడ్, నాయకులు

కొత్తూర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గతఅసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీ కోసం బీఆర్ఎస్ నాయకులు హడావుడి చేసి ప్రొసీడింగ్స్ తెచ్చి చేతులు దులుపుకున్నారే తప్పా.. నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమైనారని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ జనిగె జగన్, కౌన్సిలర్లు హేమా దేవేందర్‌ముదిరాజ్, కమ్మరి జయమ్మ జనార్ధన్‌చారి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇందూరి శ్రీనివాస్, నవీన్‌చారి, కర్రోళ్ల సురేందర్‌లు ఘాటుగా విమర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్‌యాదవ్, వైస్‌చైర్మన్ డోలీ రవీందర్, పలువురు కౌన్సిలర్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నాయకులు స్పందించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కొత్తూర్ మున్సిపాలిటీని దత్తత తీసుకుని ఎలాంటి అభివృద్ధి చేయకుండా ప్రజలను మోసం చేశారని, గత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రొసీడింగ్స్ తెచ్చి హడావుడి చేశారే తప్పా.. నిధులు మంజూరు చేయించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో జేపీ దర్గా, కుమ్మరిగూడ రోడ్లకు రివైజ్‌డ్ ప్రొసీడింగ్ తీసుకొచ్చి నిర్మాణం పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన కొత్తూర్-షాద్‌నగర్ పాత జాతీయ రహదారిని పూర్తి చేసి, రైల్వే బ్రిడ్జితో పాటు, కొత్తూర్ ప్రధాన రహదారిని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే కృషి చేశారని గుర్తుచేశారు. మున్సిపాలిటీకి కోట్లాది రూపాయలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తుంటే, బీఆర్ఎస్ నాయకులకు కళ్లు మండుతున్నాయని విరుచుకపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కొత్తూర్ మున్సిపాలిటీలో ఉన్న మహిళ ప్రజాప్రతినిధులకు మాజీ ఎమ్మెల్యే ఎంత గౌరవం ఇచ్చారో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే శంకర్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఎమ్మె సత్తయ్య, చిల్కమర్రి నర్సింహ, విజయ్‌పాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అక్కవానిగూడ రాజు, పాశం కృష్ణ, జగదీశ్వర్‌గౌడ్, భరత్‌గౌడ్, ఆంజనేయులు, నర్సింహగౌడ్, శివకుమార్‌గౌడ్, పాల్గొన్నారు.

## బీసీ మహిళలకు 50శాతం కోటా ఇవ్వాలి

బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ డిమాండ్



తాండూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

తాండూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో ఆమోదం పొందిన మహిళా బిల్లుల్లో జనాభా ప్రకారం బీసీ మహిళలకు 50శాతం సబ్ కోటా ఇవ్వాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం తాండూరు బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలకుసంఘీభావంగా అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. రాజకీయ రిజర్వేషన్లతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అంతకుముందు బీసీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు అనిత, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి జగదీశ్వరి, కార్యదర్శి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తాం

పరిగి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడం హర్షణీయమని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు కోసం అనేకమార్లు పోరాటం చేశామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును 2.8 టీఎంసీల కెపాసిటీతో నిర్మాణం చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## బీసీ బిల్లు ఆమోదం హర్షణీయం



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఈడిగ శ్రీనివాస్

తాండూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షణీయమని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం తీసుకురావడం హర్షనీయమన్నారు. మద్దతు తెలిపిన బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఎం పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. బీసీ బిల్లు ఆమోదంపై తదుపరి ఢిల్లీ కేంద్రంగా జరిగే పోరాటంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు.

## కిషన్‌రెడ్డిని కలిసిన రాజ్‌భూపాల్‌గౌడ్



రాజ్‌భూపాల్‌గౌడ్‌కు స్వీటు తినిపిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ బుధవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా రాజ్‌భూపాల్ పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి ఎండగడతానని, వచ్చే ఎన్నికల నాటికి పార్టీకి జిల్లాలో పూర్వవైభవం తీసుకొస్తానని పేర్కొన్నారు.

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కోఆర్డినేటర్ల ఎంపిక

తాండూరు/పెద్దేముల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ రాష్ట్ర కోఆర్డినేటర్లుగా తాండూరు ప్రాంతానికి చెందిన పీసీసీ జనరల్ సెక్రటరీ ధారాసింగ్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతలను నియమించారు. బుధవారం ఈమేరకు పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు నియామకాన్ని ప్రకటించారు. నారాయణపేట్‌జిల్లా మక్తల్, నారాయణపేట్ నియోజకవర్గాలకు ధారాసింగ్‌ను, జంటనగరాల్లోని సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు కల్వ సుజాతను నియమించారు. ఈప్రాంతాలకు వీరు స్టేట్‌కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు.

ఫటా ఫట్

## అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి



ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

యాచారం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉక్కపోత భరించలేక రాత్రివేళ ఇంటి దాబాలపై, ఇళ్ల ముందు నిద్రించరాదని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు చెప్పారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానం కలిగితే డయల్ 100కు కాల్‌చేసి సమాచారమివ్వాలని తెలిపారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈమేరకు ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

**ప్రశ్న: చోరీల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

**జవాబు:** రాత్రివేళ ప్రతీ స్టేషన్‌కు చెందిన సిబ్బంది గస్తీ తిరుగుతున్నారు. ఉక్కపోత భరించలేక ఇంటి దాబాలపై నిద్రించవద్దు. ఎవరైనా అపరిచితులు కనిపిస్తే డయల్ సమాచారం ఇవ్వాలి.

**ప్ర: దొంగతనాలపై ప్రజలకు మీరిచ్చే సందేశమేమిటి?**

**జ:** విలువైన ఆభరణాలు ధరించి నిద్రించరాదు. ఆభరణాలు బ్యాంకుల్లో భద్రపరచుకోవాలి. చోరీల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

**ప్ర: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

**జ:** ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో మాట్లాడి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాం. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని ఆటోలు, క్రూయిజర్ల డ్రైవర్లకు చెబుతున్నాం. రోడ్లపై బారికేడ్లు కూడా పెట్టాం.

**ప్ర: టెన్త్ పరీక్షలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?**

**జ:** డివిజన్‌లో 29 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రతీకేంద్రం వద్ద ఇద్దరు సిబ్బందిని నియమిస్తాం. మొత్తం 6536 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

# డేంజర్‌గా డివైడర్లు

- షాద్‌నగర్-మక్తమాదారం రోడ్డులో ఎక్లాస్‌ఖాన్‌పేట వద్ద తరచూ ప్రమాదాలు
- వాహనాలు ఢీకొనడంతో డివైడర్ ధ్వంసం
- పట్టించుకోని అధికారులు, పాలకులు





ఎక్లాస్‌ఖాన్‌పేట వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డుపై ఏర్పాటు చేసిన డివైడర్, వాహనాలు ఢీకొట్టడంతో ధ్వంసమైన డివైడర్

కేశంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అనాలోచిత నిర్ణయం వాహనచోదకుల పాలిట శాపంగా మారింది. డబుల్ రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించడంతో రోడ్డు ఇరుకుగా మారి ఒక వాహనం వెళితే మరో వాహనం వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనాలు డివైడర్‌ను ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. షాద్‌నగర్-మక్తమాదారం డబుల్ రోడ్డులో ఎక్లాస్‌ఖాన్‌పేట వద్ద నిర్మించిన డివైడర్ ప్రమాదభరితంగా మారింది. షాద్‌నగర్ నుంచి మక్తమాదారం వరకు దాదాపు 32 కిలోమీటర్ల డబుల్ రోడ్డును దాదాపు రూ.38 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ మార్గంలో మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో దాదాపు 300 మీటర్ల మేర డివైడర్ నిర్మించారు. రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించడంతో ఇరుకుగా మారింది. రోడ్డుపై మూల మలుపులతో పాటు, మూడు చోట్ల వాహనాల క్రాసింగ్ కోసం వదిలారు. అయితే, క్రాసింగ్‌ల వద్ద వాహనాలు ముందుకు వెళ్లే క్రమంలో డివైడర్‌ని ఢీకొంటున్నాయి. ఇలా రోజురోజుకూ డివైడర్ ధ్వంసమవుతోంది. భారీ వాహనాలు డివైడర్‌ను తాకుతూ వెళ్తున్నాయి. డివైడర్ నిర్మించడంతో రోడ్డు ఇరుకుగా మారిందని వాహనచోదకులు చెబుతున్నారు. అధికారులు అవగాహన లేకుండా డివైడర్ నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. రహదారి ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాని, దానిని తొలగించి వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**డివైడర్ ఏర్పాటుతోనే ప్రమాదాలు**



రోడ్డుపై డివైడర్ ఏర్పాటు చేయడంతో ఇరుకుగా మారింది. వాహనాలు వెళ్తున్న క్రమంలో దాన్ని ఢీకొంటున్నాయి. దాంతో డివైడర్ ధ్వంసమవుతోంది. రోడ్డు మధ్యలో డివైడర్ ఉన్న డివైడర్‌ను తొలగించి వాహనాలు సాఫీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రావుల వెంటయ్య, ఎక్లాస్‌ఖాన్‌పేట, కేశంపేట మండలం

**ఇరుకు రోడ్డుతో ఇబ్బంది పడుతున్నాం**



షాద్‌నగర్-మక్తమాదారం రోడ్డులో ఎక్లాస్‌ఖాన్‌పేట వద్ద డివైడర్ నిర్మించారు. రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. అలాగే మూలమలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

- మహిపాల్ రెడ్డి, కొత్తపేట, కేశంపేట మండలం

## క్రైం కార్నర్

### వాహనం ఢీకొని యువకుడు మృతి



హర్షవర్ధన్ రెడ్డి(ఫైల్)

శంకర్‌పల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం బైక్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. మండల పరిధిలోని పిల్లిగుండ్లలో నివాసముండే హర్షవర్ధన్ రెడ్డి(30) సివిల్ ఇంజనీర్‌గా సుబిషి వెంచర్‌లో పనిచేస్తున్నాడు. శంకర్‌పల్లిలోని వెంచర్‌లో పని ముగించుకుని మంగళవారం అర్ధరాత్రి దాటాక పిల్లిగుండ్లకు బైకుపై వెళుతుండగా, బుల్కాపూర్ అండర్‌పాస్ వద్ద హర్షవర్ధన్‌రెడ్డి వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దాంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్ రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అమ్మానాన్నలు చనిపోయి తాను అనాథగా మారానని ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన షాద్‌నగర్ రైల్వేస్టేషన్ పరిధిలోని సోలీపూర్ శివారులో బుధవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన నంద శ్రీనివాస్(32) అమ్మానాన్నలు చనిపోవడంతో ఫరూఖ్‌నగర్‌లో అక్కాబావల దగ్గర ఉండేవాడు. తల్లిదండ్రులు లేకపోవడం వల్ల పెళ్లి సంబంధాలు కుదుర్చుకోవడానికి చాలా రోజులుగా ఎవరూ ముందుకు రావడం లేదు. దాంతో తాను అనాథను కావడం వల్లే సంబంధాలు కుదరడం లేదని మనస్తాపానికి గురై సోలీపూర్ శివారులో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్ మాస్టర్ అబుదేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు.

### ఐరన్ రాడ్లను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

చౌదరిగూడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ బిల్లు లేకుండా ఐరన్ రాడ్లను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్న ఘటన కొందుర్గులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు కొందుర్గు మండల కేంద్రంలోని స్కాన్ ఐరన్ పరిశ్రమ నుంచి జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రానికి ఐరన్ రాడ్స్‌తో వెళ్తున్న మహింద్రా ట్రాక్టర్‌ను కొందుర్గు పోలీసులు తనిఖీ చేశారు. ఈమేరకు జీఎస్టీ బిల్లు లేకుండా అక్రమంగా రెండు టన్నుల ఐరన్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఏసీటీవో జడ్చర్ల అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## 'పది' పరీక్షలకు సిద్ధం

(5వ పేజీ తరువాయి)

గ్రేడింగ్ విధానం ఉండేది. ఇటీవల దాన్ని తొలగించి మార్కుల విధానం తీసుకొస్తామని ప్రభుత్వ జీవో జారీ చేసిన విషయం విదితమే. ఈ సంవత్సరానికి ఇంటర్నల్ మార్కులు (ఒక్కో సబ్జెక్టుకు 20) యథాతథంగా ఉంటాయి. గ్రేడింగ్ లేకపోవడంతో ఈ సారి మార్కుల పోటీ మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. నిఘా నీడలో పరీక్షలు జరగనున్నాయి. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్, 249 మంది సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. 22 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరి నిమిషంలో ఒత్తిడికి గురికాకుండా పరీక్ష సమయానికి కనీసం గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 9.35 గంటలకు గేట్లు మూసివేయనున్నారు. ఆలస్యంగా వస్తే ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

**ఇబ్రహీంపట్నంలో...**

ఇబ్రహీంపట్నం : పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఇబ్రహీంపట్నంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి హీర్యానాయక్ తెలిపారు. మొత్తం 12 పరీక్షా కేంద్రాల్లో 2,302 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన చెప్పారు. ఇబ్రహీంపట్నంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 280 మంది, గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్ సెంటర్-ఏలో 220 మంది, సెంటర్ -బీలో 220 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 220 మంది, శాస్త్ర గ్రామర్ హైస్కూల్‌లో 200 మంది, టీఆర్ఆర్ హైస్కూల్ సెంటర్-ఏలో 177 మంది, సెంటర్-బీలో 174 మంది, జెడ్పీహెచ్‌ఎస్ శేరిగూడలో 200 మంది, ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో 197 మంది, క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 200 మంది, ప్రియాంక హైస్కూల్‌లో 87 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

## తాగునీటి కటకట

- జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లో నాలుగు రోజులుగా మంచినీరు బంద్
- జాడలేని మిషన్ భగీరథ అధికారులు!



చౌదరిగూడ ధర్మతండాలో మిషన్ భగీరథ వాటర్ కోసం నల్లా వద్ద ఉంచిన బిందెలు, బకెట్లు

చౌదరిగూడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నాం.. మా సమస్యను తీర్చండి మహాప్రభో అంటూ మండల ప్రజలు వేడుకుంటున్నారు. వేసవికాలంలో తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఉన్నతాధికారులు మిషన్ భగీరథ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ, అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప.. తమ నీటి సమస్య పరిష్కరించడం లేదని ప్రజలు వాపోతున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ వాటర్ సప్లయ్ నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులు పడాల్సివస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ వాటర్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు నిలిచిపోతాయే తెలియని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇకపోతే పలు గ్రామాల్లో ఎక్కడెక్కడ పైపులైన్ లీకేజీలున్నాయే అధికారులకు తెలియదు. కాగా, మిషన్ భగీరథ వాటర్ నిలిచిపోయిందనే విషయమై వాటర్‌గ్రిడ్ డిప్యూటీ డీఈ సందీప్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

**తాగునీటి సౌకర్యం కల్పించాలి**



పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్నవారంతా నీటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండ వేడిమికి వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోలేని పరిస్థితి. అధికారులు స్పదించి తాగునీటి సౌకర్యం కల్పించాలి.

- అజ్మీరీ, చౌదరిగూడ, జిల్లేడ్ చౌదరిగూడ మండలం

### పార్టీ జెండా దిమ్మె ధ్వంసంపై ఫిర్యాదు

షాద్‌నగర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాజకీయ విబేధాలతో పార్టీల జెండాలు, దిమ్మెలను ధ్వంసం చేయడం సరికాదని బీఆర్‌ఎస్ షాద్‌నగర్ పట్టణాధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్ అన్నారు. ఫరూఖ్‌నగర్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఉన్న బీఆర్‌ఎస్ జెండా దిమ్మెను ధ్వంసం చేయడంపై పార్టీ నాయకులు బుధవారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం నటరాజన్, పట్టణ మాజీ మున్సిపల్ ఛైర్మన్ నరేందర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విధ్వంస రాజకీయ సంస్కృతి షాద్‌నగర్ నియోజకవర్గంలో మొదలవుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. పార్టీ జెండా దిమ్మెను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### రాష్ట్రాభివృద్ధికి సాహసోపేత నిర్ణయాలు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయా లు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.3.60లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం నగరంలోని తన నివాసంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా నాయకులు చల్లా సురేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం సాహసోపేత నిర్ణయమని కొనియాడారు. నాయకులు నరేందర్, విజయ్‌రాథోడ్, బాబా, తాళ్ళ రవిందర్, నూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

### పట్టువదలని విక్రమార్కుడు రేవంత్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు పట్టువదలని విక్రమార్కుడిలా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. బుధవారం తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025-26 సంవత్సరానికి గాను రూ.3లక్షల కోట్లకు పైగా బడ్జెట్ తెలంగాణ సంక్షేమానికి కేటాయించారన్నారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు సమన్యాయం చేశారన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ప్రజల తరఫున సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

### 'అంకెల గారడీ బడ్జెట్'

ఆమనగల్లు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను శాసనసభలో భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ అంకెల గారడీ తప్ప ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ప్రజలను మోసం చేసేలా బడ్జెట్ రూపకల్పన చేశారని ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌ను చూస్తే ఆరుగ్యారంటీలకు పాతరవేసినట్లుగా ఉందని, బడ్జెట్ అద్భుతమని అధికార పార్టీ నాయకులు పేర్కొనడం హాస్యాస్పదమన్నారు.

### మల్లు స్వరాజ్యం సేవలు మరువలేనివి

ఇబ్రహీంపట్నం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం సేవలు మరువలేనివని నాయకులు అన్నారు. ఆమె మూడవ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళ్లర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బీసామేల్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లను గడగడలాడించి కీలక భూమిక వహించిన ఆమె సీపీఎంలో అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఎనలేని సేవలందించారంటూ కొనియాడారు. మండల కార్యదర్శి బుగ్గరాములు, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్, జంగయ్య, జగన్, వెంకటేష్, ముసలయ్య, పురుషోత్తం, ఆనంద్, యాదగిరి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

## 'బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ'పై హర్షం

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడాన్ని హర్షిస్తూ ఆమనగల్లు పట్టణంలో బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పార్టీ జెండాలు చేబూని ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. దావ ధనంజయ్య, రవికాంత్‌గౌడ్, దళపతిగౌడ్, వస్పుల శ్రీకాంత్, వస్పుల శ్రీశైలం, ప్రసాద్, ఫరీద్, తదితరులున్నారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ కడ్తాల మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశం, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడాన్ని హర్షిస్తూ సంబురాలు జరుపుకున్నారు. సీఎం, భట్టి, ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపీ మల్లురవి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బీచ్యానాయక్, లక్ష్మయ్య, తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో నాయకులు సీఎం, డిప్యూటీ సీఎం, కసిరెడ్డి, ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు. కాగా, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం హర్షిస్తూ తలకొండపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. కృష్ణమాదిగ, కిరణ్‌మాదిగ, గోపాల్, జ్యోతయ్య, యాదయ్య, రాంచంద్రయ్య, తదితరులున్నారు.



ఆమనగల్లు : ర్యాలీలో శ్రీనివాస్‌గౌడ్, యాట నర్సింహ, కాంగ్రెస్ నాయకులు

**కందుకూరు :** గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ కృష్ణానాయక్‌లు అన్నారు. బుధవారం యూత్‌కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు కత్తుల వెంకటేష్ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏఎంసీ డైరక్టర్లు యుగేందర్‌గౌడ్, ప్రవాంత్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు అందుగుల సత్యనారాయణ, ఎండీ అఫ్జల్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.



చౌదరిగూడ : కొందుర్గులో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

**చౌదరిగూడ :** మందకృష్ణ మాదిగ సుదీర్ఘ కాలం చేసి పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం సాధ్యమయిందని ఎమ్మార్పీఎస్ కొందుర్గు మండలాధ్యక్షుడు ఆనంద్‌కుమార్ అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రేమ్‌కుమార్, సిద్దు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**కేశంపేట :** మందకృష్ణ సుదీర్ఘ పోరటంతోనే రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ కేశంపేట మండలాధ్యక్షుడు చిర్ర శీను అన్నారు. మండల కేంద్రంలో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల ప్రధాన కార్యదర్శి రమేష్, సీనియర్ నాయకులు గ్యార సురేష్, గంజాయి దశరథ, మల్లేష్, తదితరులున్నారు.

**చేవెళ్ల :** మందకృష్ణ మూడు దశాబ్దాలుగా అలుపెరగని పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ బిల్లు అని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్ మాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాని భానుప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహంకు నివాళులర్పించారు. మండలాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, తదితరులున్నారు.

**మొయినాబాద్ రూరల్ :** ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ మొయినాబాద్ మండల సీనియర్ నాయకుడు, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాల కృష్ణారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఏళ్ల ఎస్సీవర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం చరిత్రాత్మకమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తోందన్నారు.

## సంక్షిప్తంగా..

**ఆమనగల్లు :** మున్సిపాలిటీలో పందుల బెడదకు, నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీ కార్యాలయంలో పందుల పెంపకందారులతో కమిషనర్ శంకర్‌నాయక్ సమావేశమయ్యారు. వారం రోజుల్లో ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేసుకుని ఊరిబయటకు తరలించాలని తెలిపారు. లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు.

**షాబాద్ :** తల్లిదండ్రులను దైవసమానులుగా గౌరవించినప్పుడే సమాజం బాగుపడుతుందని వందేమాతరం ఫౌండేషన్ ఛైర్మన్ మాధవరెడ్డి అన్నారు. తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులకు విద్యార్థులు పాదపూజ చేశారు.

**మహేశ్వరం :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో పాటు సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని మహేశ్వరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కట్టిగొమ్ముల జగన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హేమంత్‌గౌడ్ అన్నారు. మహేశ్వరం మండల జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా జగన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హేమంత్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్తిస్థాయి కమిటీని త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

**యాచారం :** శ్రద్ధగా చదివి ఉన్నతిలోకి రావాలని యాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామ శాస్త్రి చెప్పారు. టెన్త్ విద్యార్థులకు జైభీం ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఇచ్చిన ప్యాడ్‌లను ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారు.

**కేశంపేట :** బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు రూ.18000 ఫిక్స్‌డ్ వేతనం ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవాలని కేశంపేట మండల ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు తరలివెళ్లారు. సుజాత, వసంత, పద్మ, జ్యోతి, పర్వీనా, సంతోష, స్వప్న, తదితరులున్నారు.

**కేశంపేట :** కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇంటర్ ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షకు179 మంది విద్యార్థులకు గాను 176 మంది హాజరయ్యారు.

**కందుకూరు :** రంజాన్ సందర్భంగా మండల కేంద్రంలో ముస్లింలకు శివ అనే వ్యక్తి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కులమతాల కతీతంగా ప్రతీఒక్కరు రంజాన్ పండగను పవిత్రంగా జరుపుకోవాలని కోరారు.

**చౌదరిగూడ :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తూంపల్లిని సందర్శించి లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన ప్రారంభించారు.

**ఆమనగల్లు :** కడ్తాల పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ నిర్వహించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ముస్లిం సిబ్బందికి ఏర్పాటు చేసిన విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు.

### కావలి చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే పరామర్శ



జయమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కావలి చంద్రశేఖర్ తల్లి కావలి జయమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మల్లేష్, ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్ మండలంలోని హైతాబాద్‌లో మృతదేహానికి నివాళులర్పించి, చంద్రశేఖర్‌ను పరామర్శించారు. వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

### హామీలను అమలు చేయాలి

చేవెళ్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి డిమాండ్ చేశారు. బుధవారం రామన్నగూడలో సీపీఐ జెండావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. మండల కార్యదర్శి సత్తిరెడ్డి, వడ్ల సత్యనారాయణ, నాయకులున్నారు.

### జాబ్‌మేళాను వినియోగించుకోండి



మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

మాడ్గుల, మార్చి 19(ఆంధ్ర జ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న కల్వకుర్తి పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఫౌండేషన్ ఛైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని 50 ప్రముఖ కంపెనీలలో 5వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాడ్గుల ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం మేళా విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువజన సంఘాల నాయకులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, నిరుద్యోగులు సమావేశంలో పాల్గొన్నారు. రచ్చ శ్రీరాములు, శ్రీనివాస్ రెడ్డి, అభినవ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, చంద్రశేఖర్, శివ తదితరులు ఉన్నారు.

### కంటిచూపుతో చదువుకు దూరం కావొద్దు



విద్యార్థులకు కళ్లద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కంటి చూపు వల్ల విద్యార్థులు చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం కళ్లజోళ్లు అందజేస్తుందని ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కళ్లజోళ్లను ఆయన అందజేశారు. షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించి ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. ఆర్‌బీఎస్‌కే వైద్యులు రాగిణి, విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యూకేటర్ జె.శ్రీనివాసులు తదితరులున్నారు.

### బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడికి సన్మానం



చేవెళ్ల/శంకర్‌పల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైనా రాములుగౌడ్‌ను చేవెళ్ల మండల బీజేపీ నాయకులు ఘనంగా బుధవారం సన్మానించారు. మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, యువనాయకుడు డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డిలతోపాటు పలువురు శంకర్‌పల్లి మండల కేంద్రంలో రాములుగౌడ్‌ను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.